ప్రజాశక్తి

బుధవారం 9 నవంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మోడీ రాకతో..

కొండలు పిండి

◆ జివిఎంసికి కనిపించని 'గ్రీన్ హిల్స్' ధ్వంసం

◆ కొమ్మాది, బోరవానిపాలెంలో కొండలు తవ్వి ఎయుకు గ్రావెల్ తరలింపు



నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, పిఎంపాలెం

'దారులన్నీ రోమ్ నగరానికే' అన్న చందాన విశాఖ నగరంలో ఏ రోడ్లు చూసినా దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాక సందడితోనే నిండిపోతున్నాయి. కేంద్ర పోలీసు బలగాల పహారా, బూట్ల చప్పుళ్లతో విశాఖ నగర వీధులన్నీ ఖాకీల వలయంలో మునిగి తేలుతున్నాయి. దేశానికే ప్రధాని అయినందున హడావుడి సహజమే.. కానీ ఈ సందర్భంగా అధికార యంత్రాంగం చేస్తున్న పనులు పలు విమర్శలకు తావిస్తున్నాయి. 12న ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో మోడీ రాక కోసం సభా వేదిక, ఏర్పాట్లు భారీగా సాగుతున్నాయి. మొత్తం గ్రౌండ్‌ను చదును చేసే కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఎయు అధికార యంత్రాంగం ఈ పనిలో నిమగ్నమైంది. ఈ గ్రౌండ్స్‌లో కూడా మొక్కలు, చెట్లు ధ్వంసం చేసేస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఇప్పటికే ఆరోపణలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. నగరంలోనే కాకుండా విశాఖ గ్రామీణ ప్రాంతం ప్రధానంగా ఆరో వార్డు పరిధిలోకి వచ్చే కొమ్మాది పరిసరాలైన బోరవానిపాలెం, ఉప్పాడ తదితర చోట్ల 'గ్రీన్ హిల్స్' (పచ్చని కొండలు) పిండైపోతున్నాయి. భారీ వాహనాలతో గడచిన నాలుగు రోజులుగా కొండలను తవ్వేసి ఈ గ్రావెల్‌ను ప్రధాని మోడీ సభ జరిగే ఎయు గ్రౌండ్స్‌కు రాత్రీ, పగలూ తరలించే ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. గతంలో ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ వేదికగా పలు సభలు, కార్యక్రమాలు జరిగినా ఇంతటి పర్యావరణ విధ్వంసం జరగలేదన్న విమర్శలు తాజాగా వినిపిస్తున్నాయి. ఇటీవలే మిగతా 2లో..

వచ్చే నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

87 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి



జిల్లాలో ఈ ఏడాది రైతుల కళ్లాలకు ధాన్యం చేరే నాటికి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలన్న ఆలోచనతో పౌరసరఫరాల సంస్థ అధికారులున్నారు. ఈ ఖరీఫ్‌లో వరి అంచనాలకు మించి సాగవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుకు తగినట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో ఉడుపులు ఆలస్యం కావడంతో ఈ నెల చివరి వారం నుంచి కోతలు అక్కడక్కడా ప్రారంభమైనా, డిసెంబరు రెండో వారం తరువాత ధాన్యం కళ్లాలకు వచ్చే అవకాశముందని వ్యవసాయశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని 24 మండలాల్లో వరి సాధారణ విస్తీర్ణం 1,36,232 ఎకరాలకుగానూ 1,39,242 (102 శాతం) ఎకరాల్లో సాగైంది. ధాన్యం తయారీనాటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు కొంత భరోసా ఇవ్వొచ్చన్న ఆలోచనతో ముందుగానే ఈ ఏడాది కేంద్రాలు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 392 రైతు భరోసా కేంద్రాలను 72 క్లస్టర్లుగా ఏర్పాటుచేశారు. ఈ 72 కేంద్రాల నుంచి 87,661 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు. గ్రేడ్ - ఎ రకం ధాన్యం క్వింటా రూ.2060, సాధారణ రకం క్వింటా రూ.2040 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేయనున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఐదు రైస్ మిల్లులకు సరఫరా చేయనున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించే వాహనాలకు జియో ట్యాగింగ్ చేయనున్నారు. ఈసారి జంబ్లింగ్ పద్ధతిలో రైస్‌మిల్స్‌కు ధాన్యం పంపిణీ చేయనున్నారు. రైతులు తాము పండించిన ధాన్యం అమ్ముకొనేందుకు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాల్సివుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతు పంట తప్పనిసరిగా ఈ - క్రాప్‌లో నమోదుకావడంతో పాటు ఇకెవైసి అవ్వాల్సివుంది. ఈ రెండూ జరగకపోతే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్ముకొనే అవకాశం రైతుకు లేదు. దీంతో మళ్లీ ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సివస్తుంది. ఇకెవైసికి సంబంధించిన వ్యవసాయశాఖాధికారులు నిర్వహించిన సోషల్ ఆడిట్, రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించిన రైతుల జాబితా, గ్రామసభల్లో ఇకెవైసి కాలేదన్న ఫిర్యాదుల కంటే, పంట నమోదులో పొరపాట్లను సరిచేయాలన్న సూచనలే ఎక్కువ వచ్చినట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. రైతులు పండించిన మిగతా 2లో..

ఆంధ్రుల హక్కును లాక్కుంటారా ?

▶ వార్త 2లో..

ప్రధాని సభ ఏర్పాట్లు పరిశీలన

▶ వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపండి

▶ వార్త మెయిన్‌లో..



బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు కుమార్, తదితరులు

ప్రధాని పర్యటన పేరిట

పేదల దుకాణాల కూల్చివేత

రోడ్డున పడ్డ వంద కుటుంబాలు

కూల్చివేత దారుణం : టిడిపి, సిపిఎం

వార్త మెయిన్‌లో..

నమోదు పూర్తి.. ఇక ప్రచారం జాస్తి

◆ గ్రాడ్యుయేట్ ఓటర్లు 2.69 లక్షలు ◆ ఆన్‌లైన్ ద్వారా అత్యధికంగా నమోదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్రలో ఎమ్మెల్సీ ఓటరు అభ్యర్థుల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగిసింది. మంగళవారం వెల్లడైన అధికారిక లెక్కల ప్రకారం.. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఆరు జిల్లాల నుంచి 2,69,535 మంది తమ ఓట్ల నమోదుకు అభ్యర్థనలు పంపారు. వీటిలో శ్రీకాకుళం జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 32,659, భౌతికంగా 16,308 కలుపుకొని మొత్తం 48,967, విజయనగరం జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 26,634, భౌతికంగా 32,647 కలుపుకుని మొత్తం 59,281, విశాఖపట్నం జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 72,765, భౌతికంగా 17,478 మొత్తం 90,243 అభ్యర్థనలు వచ్చాయని, అదేవిధంగా నూతన జిల్లాలైన అనకాపల్లి జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 23,667, భౌతికంగా 18,435 కలుపుకుని మొత్తం 42,102, మన్యం నుంచి ఆన్‌లైన్‌లో 8,393, భౌతికంగా 8,958 మొత్తం 17,351, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఆన్‌లైన్ ద్వారా 9,002, భౌతికంగా 2,589 కలిపి మొత్తం 11,591 అప్లికేషన్లు వచ్చాయని అధికారులు తెలిపారు. దీంతో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 1,73,120, భౌతికంగా 96,418 కలుపుకొని 2,69,535 మంది తమ ఓట్ల నమోదుకు అభ్యర్థనలు పంపినట్లయింది. ఓట్ల నమోదులో భాగంగా చివరి రోజే 85,499 ఓట్లు ఉత్తరాంధ్రలో నమోదుకావడం విశేషం.

ఓటర్ల నమోదు చేయించడం అన్న అంశం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టంగా చెప్పుకోవచ్చు. ఏ అభ్యర్థి ఎన్ని ఓట్లు నమోదు చేయించుకున్నారన్న, ఎలా ఓటర్లను ప్రభావితం చేశారన్న బట్టి గెలుపు, ఓటముల విశ్లేషణలు ఉంటాయన్నది తెలిసిందే. అయితే ఓటర్ల నమోదు సంగతి సరేసరి.. తర్వాత నిర్వహించే ప్రచారం, వ్యూహ ప్రతివ్యూహాలు సైతం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయన్నది తిరుగులేని వాస్తవం. ఎన్నికలకు ఇంకా చాలా రోజుల వ్యవధి ఉన్న నేపథ్యంలో.. ఒక్క మాటలో చెప్పాలంటే 2023 జనవరిలో వచ్చే సంక్రాంతి పండగ తర్వాతే ప్రతి నిమిషాన్నీ అభ్యర్థులు తమ గెలుపు కోసం వెచ్చిస్తారు. గతంతో పోల్చితే ఈసారి జరుగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకంగా మారాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి అమ్మకానికి పెట్టగా రాష్ట్రంలోని వైసిపిలో మాత్రం దీన్ని నిలుపుకోవాలన్న కాంక్ష కనిపించడం లేదు. మరోవైపు వాల్తేరు రైల్వే డివిజన్‌ను కేంద్రం ఎత్తేసింది. విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్, భోగాపురం ఎయిర్‌పోర్టుపైనా నాన్చుడు ధోరణితోనే ఇప్పటివరకూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మిన్నకుండడం చదువుకున్న వారంతా గ్రహిస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు, వాటి ఫలితాలు నిరుద్యోగ, ఉద్యోగ, సామాన్య ప్రజానీకం భవిష్యత్తు పరిస్థితులను పై సమస్యలతో చూస్తే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కొండలు పిండి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటో కార్మికుల సంక్షేమం కోసం భారీ సభను నిర్వహించారు. గతంలోనూ దేశ వ్యాపిత సభలు ఎయు గ్రౌండ్స్‌లో జరిగాయి. కానీ ఇంతలా పర్యావరణ సమస్యలను సృష్టిస్తూ ఏర్పాట్లు జరగలేదన్నది వాస్తవం. దేశ నాయకుడు వచ్చినప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నా 'కాస్త వంగమంటే ఏకంగా సాగిలపడినట్టుగా'... వైసిపి ప్రభుత్వం మోడీ ప్రసన్నం కోసం అత్యుత్సాహం చూపుతుందన్న విమర్శలు నానాటికీ అన్ని తరగతుల నుంచీ వినిపిస్తున్నాయి.

తిలాపాపం తలాపిడికెడు

దేశ ప్రధాని పర్యటన కోసం 'తిలాపాపం తలాపిడికెడు' అన్న చందాన జివిఎంసి, రెవెన్యూ, హౌసింగ్ ఇలా పలు ప్రభుత్వ శాఖలు ఈ పనుల నిర్వహణలో అగ్రభాగాన నిలుస్తున్నాయి. పర్యావరణ విధ్వంసం జరుగుతోందని వారికి అర్థమవుతున్నా మోడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలతో చేపడుతున్నామని, పాపం ఏదైనా ఉంటే అటు పోతుందనే పద్ధతిలో ఈ శాఖల అధికారులు సమాధానమిస్తున్నారు. కొండలపై తవ్వకాలు జరగకూడదన్న కోస్టల్ రెగ్యులేటరీ యాక్ట్ (సిఆర్‌జెడ్) ఉన్నా ససేమిరా అని అధికారులు అంటున్నారు. ఇంత భారీ స్థాయిలో కొండలను సభల కోసం తవ్వేసే ఘటనలు గతంలో ఎన్నడూ జరగకపోవడంతో రోడ్లపై భారీ వాహనాలు ఈ గ్రావెల్ (మట్టి)ను తరలించుకు పోతున్న క్రమంలో రోడ్లపై జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

విభజన చట్టం అమలు చేయకుండా దేనికీ పర్యటన ? : సిపిఎం

కొండలను తవ్వుతున్న ప్రాంతాన్ని మంగళవారం సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు సందర్శించి పర్యావరణానికి ఇంత నష్టం ఎలా చేస్తారంటూ మండిపడ్డారు. కొండలు తవ్వి కాలుష్యాన్ని స్వాగతించే విధ్వంసం ఆపాలని అధికారులను డిమాండ్ చేశారు. ఎపికి విభజన హామీలేవీ అమలు చేయకుండా, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణకు పెట్టి ఈ ప్రాంత పర్యటన చేస్తే ప్రజలు సహించరన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని విశాఖ సభలో ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వచ్చే నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా ఈ ఏడాది వ్యవసాయశాఖ ఈ - పంట నమోదు, ఇకెవైసిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ సమస్యలను తెలియజేసేందుకు కంట్రోల్ రూమ్, ఫోన్ నెంబర్లను పౌరసరఫరాల సంస్థ అధికారులు ఏర్పాటు చేయనున్నారు.

నమోదు పూర్తి.. ఇక ప్రచారం జాస్తి

గనక తీవ్రస్థాయిలో ప్రభావితం చేయనున్నాయి.

ఈ సారి పోటీ రసవత్తరమే...

2023లో జరుగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత రసవత్తరంగా సాగనున్నాయి. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ప్రజా సమస్యలపై రాష్ట్రంలోని చట్టసభల్లోనూ, బయటా పోరాడుతూనే ఉంది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్ నుంచి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్న విషయం తెలిసిందే. వైసిపి తరపున బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, తెలుగుదేశం తరపున గాడు చిన్ని కుమారి లక్ష్మి, బిజెపి తరపున ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న పివిఎన్.మాధవ్ ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత అన్ని తరగతుల్లోనూ నెలకొని ఉండడంతో అధికార పార్టీపై పై చేయి సాధించడం కోసం అభ్యర్థులు పోటీపడుతున్నారు.

జివిఎంసి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు మంగళవారం ఎయు కాన్వకేషన్ హాల్‌లో జివిఎంసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మహాజన సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి నాలుగో ర్యాంకు రావడానికి కార్మికుల కృషే కారణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ వివి.వామన రావు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, పి.గౌతమ్ రెడ్డి, బద్రీనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఎఐడిఎస్ఒ ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిసి వెల్ఫేర్ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులను మెరుగు పరచాలని, రవీంద్ర నగర్ బిసి బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీలో కూడా హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంవిపిలో ఉండే వెల్ఫేర్ ఆఫీస్ వద్ద అల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్ఒ) ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. సంఘం నగర కార్యదర్శి కె.అభిలాష్ మాట్లాడారు.

బెస్ట్ అవైలబుల్ స్కూలు పథకాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి బెస్ట్ అవైలబుల్ స్కూలు పథకాన్ని కొనసాగించాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతాడ జోగారావు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఏర్పాటు చేస్తూ జీవో 19 ఇచ్చారని తెలిపారు. అప్పటినుంచి అమలులో ఉన్న ఈ పథకం కింద సుమారు వెయ్యి మంది దళితులు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తులపై సమగ్ర దర్యాప్తు

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు దరఖాస్తులపై ఎన్నికల కమిషన్ సమగ్ర విచారణ జరపాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబరు 1 నుంచి నవంబరు 6 వరకు 37 రోజుల్లో వచ్చిన దరఖాస్తులు 1,84,076 కాగా వీటిలో అధికారుల ఆధ్వర్యంలో అక్టోబరు 30, నవంబరు 6 తేదీల్లో స్పెషల్ డ్రైవ్‌లు కూడా నడిచాయన్నారు. సమీక్షలు జరిగాయన్నారు. అయితే, నవంబరు 7వ తేదీ ఒక్క రోజే 85,499 దరఖాస్తులు వచ్చినట్టు జగ్గునాయుడు తెలిపారు. మొత్తం దరఖాస్తులలో 31.9 శాతం ఈ ఒక్క రోజే రావడం ఎలా సాధ్యమన్నారు. 37 రోజుల్లో ఏ రోజు కూడా ఇన్ని దరఖాస్తులు రాలేదన్నారు. అధికార వైసిపి నాయకులు, కొందరు అధికారులు మిలాఖత్ అయినట్టు తెలుస్తోందన్నారు.

అలాగే అనర్హుల దరఖాస్తులను కూడా కొందరు నమోదు చేసినట్లు సమాచారం వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ దీనిపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని కోరారు.

ఆంధ్రుల హక్కును లాక్కుంటారా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్నో పోరాటాలు, అనేక త్యాగాలు, ఆత్మ బలిదానాలతో ప్రభుత్వ రంగంలో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడమంటే ఆంధ్రుల హక్కును లాక్కోవడమేనని ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 586వ రోజుకు చేరాయి. దీక్షలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా' అని ఎంత ఖ్యాతిగాంచిందో, వైజాగ్ స్టీల్ అనేది కూడా భారతదేశంలో అంతటి కీర్తి ప్రతిష్టలను ఆర్జించిందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి శేఖర్, కెవిపి.చంద్రమౌళి, నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, కె.నరసింగరావు, బిల్డింగ్ వర్కర్లు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న సిఐటియు జగదాంబ జోన్ నాయకులు

డిస్కవరీ డే రౌండ్‌కు అంబేద్కర్ గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

2023-24 కెనెడి లూగర్ యూత్ ఎక్స్ఛేంజ్, స్టడీ ప్రోగ్రాం (కెఎల్‌వైఇఎస్) కింద ఏడాది పాటు అమెరికాలో విద్యనభ్యసించేందుకుగానూ మూడో దశ అర్హత సాధనకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు 18 మంది ఎంపికయ్యారు. బుధవారం అమెరికన్ కార్నర్, లోకెటెడ్ ఇన్ ఫ్రాన్సిస్ కాలేజీ ఫర్ ఉమెన్ ఇన్ బేగంపేటలో జరగనున్న డిస్కవరీ డే రౌండ్‌లో పాల్గొనేందుకు అధ్యాపకుల సంరక్షణలో 18 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మంగళవారం బస్సులో హైదరాబాద్ పంపించినట్లు అంబేద్కర్ గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. డిస్కవరీ డే రౌండ్‌లో ప్రతిభ కనబర్చి, తదుపరి దశలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అమెరికాలో ఏడాదిపాటు విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్బవరం గురుకుల ప్రధానాచార్యులు కె.విజయ్‌కుమార్, అధ్యాపకులు బి.రామకృష్ణ, వై.సత్యనారాయణ, ఎంవి.సురేష్ పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థుల బృందం



ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి అమర్‌నాథ్

ప్రధాని సభ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ఈ నెల 11, 12 తేదీల్లో వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు మంగళవారం పరిశీలించారు. ప్రధాని మోడీ పాల్గొననున్న బహిరంగ సభ వేదికను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సభకు రెండు లక్షల మందికి పైగా ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అవసరమైన చర్యలు తీసుకునే విధంగా మంత్రి అమర్‌నాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పదో తేదీ సాయంత్రానికి సభా ప్రాంగణం సిద్ధంగా ఉంటుందని అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కన్నబాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సుధాకర్, జివిఎంసి కమిషనర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ బీచ్ శుభ్రత

ప్రజాశక్తి-మధురవాడ : సాగర్‌నగర్‌లో బీచ్‌లో హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యాన మంగళవారం బీచ్ క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌పిసిఎల్ సిఎమ్‌డి పుష్పకుమార్ మాట్లాడుతూ, సముద్రాలు ప్రాణదాతలుగా నిలుస్తాయన్నారు. మానవాళికి ప్రత్యక్షంగా ఆహారాన్ని, పరోక్షంగా ఆక్సిజన్‌ను పెద్దమొత్తంలో సముద్రాలు అందిస్తున్నాయన్నారు. సముద్రాలను సంరక్షించుకోవడం మానవ మనగడకు ఎంతో అవసరమన్నారు. తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు.

హెచ్‌పిసిఎల్ సంస్థ సాగర్‌నగర్ వద్ద తీరాన్ని దత్తత తీసుకుని తరచూ సాగరతీర స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. హెచ్‌పిసిఎల్ సిజిఎం (హెచ్‌ఆర్) కె.నగేష్ మాట్లాడుతూ జివిఎంసి, జిల్లా కలెక్టర్ సహకారంతో సాగర్‌నగర్ తీరాన్ని దత్తత తీసుకున్నామని చెప్పారు. వారంలో రెండవ సారి మెగా బీచ్ క్లీనింగ్ డ్రైవ్‌ను చేపట్టినట్లు తెలిపారు. హెచ్‌పిసిఎల్ ఉద్యోగులు, అధికారులు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు సాగరతీరంలో సుమారు వెయ్యి కిలోల వ్యర్థాలను ఏరి జివిఎంసి పారిశుధ్య విభాగానికి అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ ఇడిలు వి.రతన్‌రాజ్, పి.వీరభద్రరావు, ఆర్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన సాగర తీర స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఆరు రోజులుగా స్థానిక బీచ్‌లో వ్యర్థాలను సేకరించారు. అడాప్ట్ ఎ పోర్షన్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 19 కిలోల ప్లాస్టిక్, 46 కిలోల ఇతర వ్యర్థాలు, 7 కిలోల గాజును సేకరించి జివిఎంసికి చెందిన క్లాప్ వాహనానికి మంగళవారం అందజేశారు. దివీస్ సిఎస్ఆర్ అధికారి సురేష్ కుమార్, శేఖరబాబు, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సాగర్‌నగర్ బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న హెచ్‌పిసిఎల్ అధికారులు, సిబ్బంది

నేరాలు ఘోరాలు

రిజర్వాయర్‌లోకి దూకి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయర్‌లోకి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... మంగళవారం ఉదయం సుమారు 10 గంటలకు ఓ వ్యక్తి ముడసర్లోవ రిజర్వాయర్‌లో దూకాడు. దూకిన తరువాత చెరువులో ఉన్న ఒక పొదను పట్టుకొని కేకలు వేయడంతో విధుల్లో ఉన్న పార్కు గార్డులు చెరువులోకి దూకి బయటకు తీశారు. వ్యక్తి వివరాలు అడిగి తెలుసుకొని, వారి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొత్తవలస గ్రామానికి చెందిన దేవుడుబాబు (35)గా గుర్తించారు. ఇతను వాలంటీర్‌గా పనిచేసేవాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. గత కొంత కాలంగా దేవుడుబాబు మానసిక పరిస్థితి బాగోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పోలీసులు దేవుడుబాబును కుటుంబీకులకు అప్పగించారు.



బీమా తక్షణ సహాయం అందిస్తున్న సర్పంచ్ ఛాయాగౌతమి

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, టి.నగరపాలెం గ్రామానికి చెందిన డి.ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా కింద ఆమె బంధువు కొండమ్మకు తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బీమా కింద రూ.లక్ష మంజూరైనట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని నామినీ అకౌంట్‌కు జమచేయనున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ, ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథ్, సచివాలయ సిబ్బంది లోకేశ్వరి, విఆర్ఒ రఘు పాల్గొన్నారు.

ఫోన్ పోతే ఎక్కడి నుంచైనా ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : నగర పరిధిలో ఫోన్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సైబర్ క్రైమ్ పోలీసులు రిలీఫ్ టెక్ నాలెడ్జ్ సహాయంతో ఒక వెబ్ పోర్టల్‌ను రూపొందించినట్లు పిఎం పాలెం నేరవిభాగపు సిఐ రమేష్ తెలిపారు. ఈ వెబ్ పోర్టల్‌లో నగరంలో ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నగరంలో ఫోన్ పోగొట్టుకున్నా, ఫోన్ చోరీకి గురైనా పోలీసు వాట్సాప్ నెంబరు 9490617916కు హాయ్ అని మెసేజ్ చేస్తే వెంటనే వాట్సాప్ చాట్ బాక్సు నుంచి ఆటోమేటిక్ రెస్పాన్స్ వస్తోందని తెలిపారు. అందులో ఒక లింక్, క్యూఆర్ కోడ్ ఉంటాయని, లింకుపై క్లిక్ చేసి బాధితుని వివరాలను పొందుపరచాలని పేర్కొన్నారు. పేరు, పోగొట్టుకున్న చరవాణి నెంబరు, ఐఎంఇఐ నెంబరు, ఏరియా పోలీసుస్టేషన్ పేరు, చిరునామా, పోగొట్టుకున్న స్థలం పొందుపరచాలని తెలిపారు. ఈ సమాచారం సిటీ పోలీసు ఫోన్ వాట్సాప్ చాట్ బాక్సు అడ్మిన్‌కు చేరుతుందన్నారు. అక్కడి నుంచి పోలీసులు ఫోన్‌ను ట్రాక్ చేసి సంబంధిత బాధితుడికి సమాచారం ఇస్తారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మురుగుతో ఇక్కట్లు

ప్రజాశక్తి -మధురవాడ : రహదారిపై మురుగు ప్రవహించడంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో జాతీయ రహదారికి ఆనుకోని క్రికెట్ స్టేడియంనకు ఎదురుగా రామరాజు లే-అవుట్ ఉంది. రహదారికి కాలనీకి మధ్యలో డ్రెయినేజీని ఏర్పాటుచేశారు. దీనికి మురుగుపోయే అవుట్ లెట్‌ను అధికారులు చూపకపోవడంతో కాలువ నిండి మురుగు నీరు కాలనీల్లోకి ప్రవహిస్తోంది. దీంతో అటుగా పోయే ప్రయాణికులు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు పోయే మార్గం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



అవుట్ లెట్ లేక రహదారిలోకి వస్తున్న మురుగు నీరు

అప్పన్న ఆలయ కవాటబంధనం

ప్రజాశక్తి-సింహాచలం: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం అప్పన్న ఆలయంలో ఆలయ ద్వారాలు మూసి కవాటబంధనం చేశారు. ఈ సందర్భంగా టోల్‌గేటును మూసివేసి సింహగిరిపైకి ఏ ఒక్కరినీ అనుమతించలేదు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-సింహాచలం: జివిఎంసి 98వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పివి.నరసింహులు ఆదేశాల మేరకు దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు.

దీపోత్సవంపై నేడు సమీక్ష

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలో ఈ నెల 23న నిర్వహించే శ్రీఅనంత పద్మనాభస్వామి కొండమెట్లు దీపోత్సవంపై బుధవారం కొండ కింద ఉన్న కుంతీమాధవస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఇఒ కీర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.



ఆక్రమణ స్థలంలలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఆనందపురం ఎస్‌సి, బిసి కాలనీలో సుమారు 40 సెంట్లు ఆక్రమణ స్థలంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. హైస్కూల్ పక్కన ఎస్‌సి, బిసి కాలనీ సర్వేనెంబర్ 276లో 40 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమణకు పాల్పడుతున్నట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. తహసీల్దార్ లోకవరపు రామారావు ఆదేశాల మేరకు విఆర్ఒ అప్పలరెడ్డి ఆధ్వర్యాన విఆర్ఎ అప్పలరాజు స్వర్ణలత హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొట్టిపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్



ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -ఆనందపురం : గొట్టిపల్లి గ్రామంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపల్లి సర్పంచ్ గంటా జగదీశ్వరరావు మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో గ్రామీణ ప్రాంతాలకు వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. హాస్పిటల్‌కి వెళ్లలేని వృద్ధులు, చిన్న పిల్లలకు, దీర్ఘకాలికంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ షహనాజ్ సాధ్య తెలిపారు. బాలింతలు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారికి పరీక్షలు, గర్భిణులకు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యాధికారి డాక్టర్ జి.ఆదిత్య, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్‌బాబు, ప్రసాదరావు, ఆరోగ్య పర్యవేక్షకులు పి.సన్యాసిరావు, సిహెచ్ఒలు ప్రీతి పండ, స్వర్ణలత, ఆరోగ్య కార్యకర్తలు సింహాచలం, జ్ఞానేశ్వర్ రావు, ఆశా కార్యకర్తలు గంగాభవాని, సరస్వతి కృష్ణవేణి, బంగారమ్మ, సావిత్రి, పైలెట్ తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో మెగా ఆర్థో మెడికల్ క్యాంపునకు స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో మెగా ఆర్థో మెడికల్ క్యాంపును డైరెక్టర్ కె రాంబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విమ్స్ ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన ఆర్థోపెడిక్ డాక్టర్లచే వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులను పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో రూ.2000 విలువ చేసే ఎముకల సాంద్రత పరీక్ష, సీరం యూరిక్ యాసిడ్ పరీక్ష ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. తొలి రోజు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు క్యాంపు ఉంటుందని, ప్రజలు సందర్శించి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ టి.భవానీప్రసాద్, ఆర్ఎమ్ఒలు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మృదుల, డాక్టర్ బి.రవితేజ, డాక్టర్ శ్యామ్, డాక్టర్ కృష్ణకార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అనిల్ నీరుకొండలో రేడియాలజీ డే



రేడియాలజీ డే లో వైద్యులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో మంగళవారం రేడియాలజీ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కన్సల్టెంట్ ఇంటర్ వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ పిరాజేష్ హాజరై మాట్లాడారు. ఇంటర్ వెన్షనల్ రేడియాలజీ ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) గణేష్ మాట్లాడుతూ, తమ ఆసుపత్రిలో సిటి, ఎంఆర్ఐ, మెమో గ్రఫీ, అల్ట్రా సౌండ్ తదితర రేడియాలజీ సర్వీసులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణమూర్తి, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రాధా మాధవ్ త్రిపాఠి, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా రామ్మోహన్‌రావు



ప్రజాశక్తి -మాధవధార : భువనేశ్వర్‌లో నిర్వహించిన కేంద్ర కార్యవర్గ సమావేశాలలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా పి.రామ్మోహన్ రావు నియమించారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే యాజమాన్యం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. రైల్వే కార్మిక సంఘాలలో సుదీర్ఘ అనుభవం, అనేక ఉన్నత పదవులు అలంకరించిన రామ్మోహన్‌రావు మరొకసారి యూనియన్ కేంద్ర కార్యవర్గానికి ఎన్నిక కావడం పట్ల ఈస్ట్ కోస్ట్ రైల్వే వ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ, కార్మికులకు మరింత మెరుగైన సేవలనుందించడానికి కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాన కార్యదర్శి పికె.పట్నాయక్, జోనల్ అధ్యక్షులు ఆర్‌విఎస్ఎస్ రావు, ఇతర కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రధాని సభ విజయవంతానికి సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 11, 12 తేదీల్లో చేపట్టే విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, రొంగలి జగన్నాధం, చొక్కాకుల లక్ష్మీవెంకటరావు, కార్పొరేటర్లు కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాస్, అల్లు శంకరరావు, బర్కత్ అలీ, కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజనీఈశ్వరరావు, కెవిఎన్ శశికళ, నాయకులు సేనాపతి అప్పారావు, నీలి రవి, పీలా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : నటరత్న కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం విశాఖ పౌర గ్రంథాలయంలో నందమూరి చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. భయ్యా శ్రీనివాస్, రమణి పాడిన కనులీవేళ చిలిపిగ, మహ్మద్ ఖాన్, గీత పాడిన అందాల ఆడ బొమ్మా రాము, సాత్విక పాడిన దోర నిమ్మ పండులాగ, పోతురాజు శ్రీనివాసరావు, సీవీ రాజేశ్వరి కలిసి పాడిన సన్న జాజులోయ్, లోకేష్, శైలజ పాడిన చిలక పచ్చకొక, సుధీర్, శైలజ పాడిన చిలక కొట్టుడు కొడితే, భయ్యా, రమణమ్మ పాడిన చిత్రం భళారే విచిత్రం, శ్రీనివాస్, జ్యోత్స్న పాడిన జింగు రింగు చీర వంటి హుషారైన గీతాలు ప్రేక్షకులను రంజింప జేశాయి. కీ బోర్డుతో లోకేష్, తబలాతో శివ, పాడ్స్‌తో అప్పలరాజు, కాంగోతో బాబ్జి వాయిద్య సహకారం అందించారు. ఎస్ ఫణిస్వామి, కళా సంస్థల కార్యర్శి చెన్నా తిరుమలరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సూర్యప్రభ, జెఎంఆర్ నెహ్రూ, వెంకటేష్, కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ద్వారం వెంకట స్వామికి నీరాజనం

ప్రజాశక్తి-సిరిపురం : వయోలిన్ వాయిద్యంలో శాస్త్రీయ సంగీతానికి ద్వారం వెంకటస్వామినాయుడు వన్నె తెచ్చారని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. ద్వారం 129వ జయంతి సందర్భంగా మంగళవారం ఆర్‌కె.బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, కర్ణాటక సంగీతాన్ని సొరంగిపై వినిపించవచ్చుని నిరూపించిన ప్రథమ వ్యక్తి ద్వారం అని కొనియాడారు. శంభారావం అధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ మాట్లాడుతూ, దేశం గర్వించదగ్గ గాయకుడు ఘంటసాలకు సంగీతాన్ని ఉచితంగా నేర్పించిన మహనీయుడు అని తెలిపారు. సమైక్య భారతి జాతీయ సమన్వయ కర్త పి.కన్నయ్య, ప్రజా గ్రంథాలయాల అభివృద్ధి సంస్థ అధ్యక్షులు పిఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ వయోలిన్, తంబూరా, వీణ తదితర సంగీత పరికరాల శిక్షణ కోసం వ్యాసాలు రాయడంలో గొప్ప గుర్తింపు పొందారన్నారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సంగీత సంస్థల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు...

అన్ని పార్టీలూ ప్రధానికి విజ్ఞప్తిచేయాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



స్టీల్‌ప్లాంట్ రహదారిలో ప్రచారం నిర్వహిస్తున్న పోరాట కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని పార్టీలూ ప్రధానమంత్రి మోడీకి విజ్ఞప్తి చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 635వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ సిఇసిపిపి విభాగం కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చుకునేందుకు ఇతర రాష్ట్రాల్లో పార్టీలకతీతంగా పనిచేసే ఒరవడి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని పార్టీలు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని పార్టీలు కలిసి పనిచేయకపోవడం వల్ల ఇప్పటికే భారీ మూల్యం చెల్లించుకున్నామని తెలిపారు. విశాఖ ఉక్కు విషయంలో అలాంటి తప్పు జరగకుండా అన్ని పార్టీలు ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని, తద్వారా ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు కృషి చేయాలని కోరారు. వామపక్షాలు తప్ప రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలూ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

రహదారులపై ప్రచారం

మోడీ పర్యటన సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఉక్కు కార్మికులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ఉదయం స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే అన్ని రహదారులపైనా ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ప్రచారం చేపట్టారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సమావేశంలో తీర్మానాల మేరకు స్టీల్‌ప్లాంట్ లోపల అన్ని విభాగాల్లోనూ సమావేశాలు ఏర్పాటుచేసి ప్రచారం చేశారు. మోడీ పర్యటన సందర్భంగా జరుగుతున్న ఈ నిరసన కార్యక్రమాలకు వేలాదిమందిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తున్నట్లు ఈ పర్యటనలో మోడీ ప్రకటన చేయాలని ఉక్కు కార్మిక సంఘం నేతలు, పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం బైక్ ర్యాలీ, 11న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, రామ్మోహన్‌కుమార్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం కూర్మన్నపాలెం కూడలి నుంచి నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిర్వహించే భారీ బైక్ ర్యాలీలో ఉక్కు కార్మిక వర్గం పాల్గొనాలని పోరాట కమిటీ పిలుపు నిచ్చింది. మంగళవారం పోరాట కమిటీ నేతలు రోలింగ్ మిల్స్ విభాగాలలో బైక్ ర్యాలీ ప్రచారాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు జె.అయోధ్యరామ్, కె.రాజబాబు, డి.దేముడు, కె.పరంధామయ్య, డివిఆర్.రెడ్డి, త్రినాథం, సీతారామరాజు, శ్రీనివాస్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 8.30కు ప్రారంభమయ్యే బైక్ ర్యాలీలో కార్మికవర్గం పాల్గొని ప్రధానికి గుణ పాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నక్క లక్ష్మణరావు, సోమేష్

ప్రజాశక్తి ములగాడ : కీర్తిశేషులు నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ప్రతినెలా 8, 18, 28 తేదీలలో ఎన్‌టిఆర్‌ను స్మరించుకుంటూ కార్యక్రమాలు చేపడుతున్నట్లు విశాఖ పార్లమెంట్ టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణరావు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఆర్‌కె.పురం పెట్రోల్ బంకు వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 100 మంది కార్మికులకు అల్పాహారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిఎన్‌టియుసి నాయకులు కె.ఆది, మజ్జి సోమేష్, రాష్ట్ర తెలుగుయువత నాయకులు సిహెచ్ రామ్మోహన్, ఆర్మీ శ్రీను, చింతలపూడి సత్తిబాబు, పొక్కల కృష్ణ, ఎకెసి సురేష్, జయశంకర్, భీమ పాల్గొన్నారు.

40వ వార్డులో చురుగ్గా అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 40వ వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు వార్డులో అభివృద్ధి పనులతో పాటు ప్రధానమంత్రి మోడీ పర్యటనలో భాగంగా జరుగుతున్న ప్రధాన రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నేటి వరకూ సుమారు రూ.2.50 కోట్ల ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. బుధవారం మరో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. తాను జివిఎంసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా నెరవేర్చుతున్నట్లు తెలిపారు. ఎకెసి కాలనీలో యుపిహెచ్‌సి ప్రారంభం, యుజిడి సమస్యకు పరిష్కారం, వాంబే గృహాల మరమ్మత్తులు, ప్రధాన గెడ్డ ఆధునికీకరణ తదితర హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. త్వరలోనే రాజీవ్ కాలనీ రెకుల షెడ్ల స్థానంలో పక్కా గృహాల నిర్మాణాలకు కూడా ఆదారి ఆనందకుమార్ కృషితో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ డిఇ ఏడుకొండలు, ఎఇ సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10న వికలాంగుల బస్సు పాస్ క్యాంపు

ప్రజాశక్తి -ములగాడ : ఆర్‌టిసి సౌజన్యంతో వికలాంగులకు ఉచిత బస్ పాసుల నిమిత్తం ఈ నెల 10వ తేదీన క్యాంపు నిర్వహిస్తున్నట్లు శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మల్కాపురం పరిధి ప్రకాష్‌నగర్ ఏడుగుడులు సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం వద్ద ఈ క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. వికలాంగులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపుకు వచ్చేవారు సదరం సర్టిఫికెట్, ఆధార్, రైస్‌కార్డుల జెరాక్స్ సెట్లు రెండు, ఫొటోలు రెండింటితో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9985336148 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వీధి లైట్లు వెలగక ఇబ్బందులు

ప్రజాశక్తి- గాజువాక : పెదగంట్యాడ జనరల్ హాస్పిటల్ నుంచి స్టీల్‌ప్లాంట్ బిసి గేట్ వరకు రహదారిలో లైట్లు వెలగక కార్మికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు నాయకులు ఎన్.రామారావు, పాల అప్పలరెడ్డి తెలిపారు. ప్రతి రోజూ ఈ రహదారిలో వేలాది మంది కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. వీరంతా రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రమాదం జరగకముందే లైట్లు వెలిగేటట్లు చూడాలని కోరారు.

వరి పంటపై తెగుళ్ల దాడి

దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతుల్లో ఆందోళన



చౌడువాడలో సుడి దోమకు తెల్లగా వచ్చేసిన వరి పైరు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడంతో వరి పైరు ఆశాజనకంగా ఉంటుందన్న రైతులు భావించగా, తెగుళ్ల రూపంలో వారి ఆశలు అడియాశలయ్యాయి. వరి పంటపై తెగుళ్ల దాడి ఎక్కువ కావడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కె.కోటపాడు మండలంలో ఈ ఏడాది 2,245 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు సంతృప్తిగా కురవడంతో మెట్టు ప్రాంతాల్లో కూడా వరి పంట వేశారు. ఈ ఏడాది వరి ఆశాజనకంగా ఉంటుందని భావించగా, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఒక్కసారిగా తెగుళ్ల బెడద ఎక్కువైంది. ప్రతి ఏటా ఆకు ముడత, పాచి తెగులు, దోమకాటు వరిలో ఎక్కువగా కనిపించేవి. ఈ దఫా దోమకాటు అధికంగా ఉంది. దీని వల్ల ఎక్కువ నష్టం జరగనుందని రైతులు అంటున్నారు.

రైతులకు ఎప్పటికప్పుడు పలు సూచనలు ఇస్తున్నా కొందరు రైతులు సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ నష్టాల పాలవుతున్నారని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఉడుపుల సమయం నుండే కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్లను 90 శాతం వరకు నివారించుకోవచ్చని చెబుతున్నారు. ఊడుపుల సమయంలో దూర దూరంగా నాట్లు వేసుకుని, మధ్య మధ్యలో నడకదారులు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పినా కొందరు రైతులు పట్టించుకోవడం లేదని, దీనివల్ల పంట లోపలికి గాలి వెలుతురు లేకపోవడంతో తెగుళ్ళు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయని చెబుతున్నారు. అలాగే యూరియా అధికంగా వాడటం కూడా వరి పంటకు ప్రమాదకరంగా ఉంటుందని అంటున్నారు.

రైతులు ఎక్కువగా పంట మార్పిడి చేయకపోవడం కూడా తెగుళ్లకు కారణమవుతుందని తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఆర్‌జెఎల్ రకం వేస్తున్నారు. గత పదేళ్ల నుండి ఇదే రకం వేయడం కూడా తెగుళ్ల సోకటానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రోజు విడిచి రోజు పురుగుమందులు పిచికారీ చేస్తున్నా ఈ సంవత్సరం 30శాతం వరకు పంట దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సుడి దోమ నివారణకు తక్షణమే చర్యలు



సుడి దోమ నివారణకు రైతులు దుబ్బులను పరిశీలించి దుబ్బుకు ఐదు తల్లి పురుగులు కన్నా ఎక్కువ ఉంటే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. ముందుగా పొలంలో ఎక్కువగా ఉన్న నీటిని తీసివేయాలి. సూర్యరశ్మి తగిలే విధంగా జాడులుగా తీయాలి. ఎకరానికి 120 గ్రాముల పైమెట్రోజిన్ అనే మందును నేరుగా గాని, లీటర్ వేప నూనెలో కలిపిగాని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదంటే డైనిట్రోఫురాన్ అనే మందును ఎకరానికి 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. దోమ దుబ్బులను అంటిపెట్టుకొని ఉంటుంది. దుబ్బులు బాగా తడిచే విధంగా పురుగు మందు పిచికారీ చేయాలి.

- సోమశేఖర్,
మండల వ్యవసాయ శాఖాధికారి



బేవరేజెస్ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎగుమతి కూలి రేట్లు పెంచాలని ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి

బేవరేజెస్ కంపెనీలో ఎగుమతి కూలి రేట్ల ఒప్పందం పూర్తయి ఏడాదవుతున్న నూతన ఒప్పందం, కూలి రేట్లు పెంచడం చేయలేదని, తక్షణమే కూలి రేట్లు పెంచాలని కోరుతూ అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ బేవరేజెస్ కంపెనీ ముందు కార్మికులు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హమాలీ యూనియన్ నాయకులు జీరు కనక రమణ, కరణం కొండలరావు, టి.రాజు, బి శ్రీను, సూరి నాయుడు, రాజేష్ ప్రసాద్ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటినా తమ కూలి రేట్లు మాత్రం పెంచలేదన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు, గ్యాస్, పెట్రోల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఇచ్చే కూలీ డబ్బులు చాలక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మద్యం పెట్టె ఒక్కంటికి రూ.8 చొప్పున పెంచాలని, హమాలీలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున హమాలీలు పాల్గొని నినాదాలు చేశారు.



రోడ్డు మధ్యలో వేసిన మట్టి

రోడ్డు మధ్యలో పైపులైన్ పనుల మట్టి

- ప్రయాణాలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి మున్సిపాలిటీ దాహార్తిని తీర్చే అతి భారీ మంచినీటి పథకం పనులు శరవేగంగా జరగుతున్నాయి. నెల రోజులుగా జరుగుతున్న పెద్దపల్లి - శేషుకొండ పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. పెద్దపల్లిలో నిర్మించబోయే సంపునుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరందించే పైప్‌లైన్ పనుల్లో భాగంగా పైపుల కోసం తవ్వుతున్న కాలువ మట్టిని రోడ్డు మధ్యలో వేస్తున్నారు. దీంతో కారులు, ఆటోలు ప్రయాణాలకు ఆటంకం కలుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని రోడ్డు మధ్యలో కాకుండా తవ్వుతున్న కాలువకు ఒక పక్క వేస్తే ప్రయాణికులకు ఎటువంటి ఆటంకం కలిగేది కాదని వాహనదారులు వాపోతున్నారు. ఇక ముందు కొనసాగే పైపు లైను పనుల్లోనైనా రహదారులకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : డిసెంబర్ 18, 19 తేదీల్లో పరవాడలో జరగనున్న సిఐటియు జిల్లా 12వ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక బైపాస్‌లో ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు మందా రాము అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ ముఠా కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు అనకాపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి పిఎన్‌వి పరమేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 12న మధ్యాహ్నం 3 గంటలకు జరిగే పట్టణ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి ఎం.భవాని, సంయుక్త కార్యదర్శి ఎం.పరదేశి, ఉపాధ్యక్షులు వెంకట్, కోశాధికారి కె.నాగేశ్వరరావు,కార్మికులు పాల్గొన్నారు.

సరియా జలపాతంలో జారిపడి విద్యార్థి మృతి

మరొకరి ప్రాణాలను రక్షించిన స్నేహితులు



మృతదేహం వద్ద రోధిస్తున్న తోటి స్నేహితులు

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని వాలాబు పంచాయితీ సమీపంలో ఉన్న సరియా జలపాతంలో కాలుజారి పడి విశాఖకు చెందిన బిబిఎం విద్యార్థి మృత్యువాత పడ్డాడు. మరో విద్యార్థిని తోటి స్నేహితులు కాపాడారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... కార్తీక మాసం సందర్భంగా విశాఖపట్నం ఎంవిపి కాలనీలో ఐఐఎం కాలేజీలో బిబిఎం కోర్సు చదువుతున్న ఆరుగురు విద్యార్థులు మంగళవారం ఉదయం సరియా జలపాతానికి వచ్చారు. స్నేహితులంతా కలిసి ఆనందంగా గడుపుతున్న సమయంలో పోతుల పవన్ కుమార్ (20) ప్రమాదవశాత్తు కాలుజారి జలపాతంలో పడిపోయాడు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన మరో యువకుడు కౌశిక్ తన స్నేహితుడిని రక్షించడానికి జలపాతంలోకి దిగాడు. ఆ యువకుడు కూడా ప్రమాదంలో చిక్కుకోవడంతో తోటి స్నేహితులు ప్రాణాలకు తెగించి కౌశిక్‌ను కాపాడారు. అప్పటికే పవన్ జలపాతంలో మునిగి అదృశ్యం కావడంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొంత సమయానికి పవన్ మృతదేహాన్ని బయటికి తీశారు. దేవరాపల్లి పోలీసులకు సమాచారం అందించి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తమతో కలిసి వచ్చిన స్నేహితుడు కళ్ళముందే మృత్యువాత పడడంతో మిగతా స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు పవన్‌కు తల్లిదండ్రులు వెంకటస్వామి, కుమారి, చెల్లెలు గాయత్రి ఉన్నారు. వీరు విశాఖ గురుద్వార్‌లో నివాసముంటున్నారు. ప్రమాదం జరిగిన స్థలం అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండటంతో అక్కడ పోలీసులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తండ్రి అంతమ సంస్కారాల్లో పాల్గొన్న కూతురు జయశ్రీ

ప్రజాశక్తి- చోడవరం

చోడవరం పట్టణానికి చెందిన పల్లెల పోతురాజు(55) గుండెపోటుతో మతి చెందగా, ఆయన పెద్ద కుమార్తె జయశ్రీ తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు నిర్వహించింది. పోతురాజు గతంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వద్ద పిఎగా పని చేశారు. ప్రస్తుతం జనసేన అనకాపల్లి నియోజకవర్గం నాయకులు పరుచూరి భాస్కరరావు వద్ద పనిచేస్తున్నారు. పోతురాజుకు మంగళవారం చోడవరంలో అంత్యక్రియలు నిర్వహించగా, పరుచూరి భాస్కరరావు ఆయన పాడి మోసి తన ఆప్యాయతను చాటుకున్నారు. పోతురాజు ఆకస్మిక మృతితో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పట్టణంలో పరుగులు ప్రముఖులు మృతదేహం వద్ద నివాళు లర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.



టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు జట్లు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు హర్యానాలో జరిగే 46వ జాతీయ టెన్నికాయిట్ పోటీలకు మహిళ, పురుష జట్లను ఎంపిక చేసినట్టు ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెఎన్‌వి సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు వైడి రామారావు తెలిపారు. క్రీడాకారులకు అనకాపల్లి జీవీఎంసీ అంబేద్కర్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ శిబిరం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళ విభాగంలో రెడ్డి మౌనిక, పి రేణుక, ఎం ప్రవల్లిక, జి శ్రావణి, జి హేమ మాధురి, ఎస్ పల్లవి శ్వేత ఆడనున్నారని, మేనేజర్‌గా అలేఖ్య వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పురుష విభాగంలో పిజెఎండి రామారావు, వి వినయ్ కుమార్, ఎల్ త్రిమూర్తులు, బి పవన్ కుమార్, ఎన్ నితిన్, కే శివ ఆడతారని, మేనేజర్‌గా కె రమేష్ వ్యవహరిస్తారని తెలిపారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : లంకెలపాలెం అభయాంజనేయ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవ సందర్భంగా వార్షికోత్సవ పోస్టర్‌ను మంగళవారం స్థానిక నర్సింగరావుపేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు కోరుకొండ పద్మ, గొన్న రమాదేవి, గొంతిన భారతి, ఆలయ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మడక రమేష్ నాయుడు, శ్రీనివాసరావు, నర్సింగరావు, నారాయణరావు, సత్యనారాయణ, బుజ్జి, అప్పలరాజు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు


హెచ్చరిక బోర్డు వేస్తున్న ఎంపిడిఒ తదితరులు

దోసూరు హైస్కూల్ స్థలంలో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఆక్రమిత దోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలంలో మంగళవారం ఎంపిడిఒ విజయలక్ష్మి ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దోసూరు హైస్కూల్‌కు 1961లో స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన దాతలు విరాళంగా ఇచ్చారు. అదే స్థలాన్ని కొంతమంది వ్యక్తులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాలను గ్రామస్తులు, అఖిలపక్ష పార్టీల నాయకులు అడ్డుకున్నారు. ఈ స్థల విషయమై జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో సందర్శించి ఈ స్థలంపై ఎవరికి ఎటువంటి హక్కులు లేవని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ స్థలంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ తమరాల తారబాబు, రాజాన అప్పారావు, రొంగలి అప్పారావు, సింగంపల్లి అప్పారావు, బండి అప్పారావు, గండి హరి, గండి రాజు, విఆర్ఓ పాల్గొన్నారు.

వృద్ధ కళాకారుల పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఉన్న రంగస్థల వృద్ధ కళాకారులు పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.ఇంద్రావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ ఇతర పింఛన్లు పొందని తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి, 58 సంవత్సరాల దాటిన వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. కళాకారునిగా గుర్తింపు పత్రం, కుల ఆదాయ ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డు జత చేసి ఈనెల 15లోగా కలెక్టరేట్‌లో ఉన్న పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కళాకారుల గుర్తింపు కార్డు కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. రంగస్థలం నాటకాలు, బుర్రకథలు వంటి కళారూపాలలో అనుభవం, ప్రదర్శన ఫొటోలు, ప్రశంస పత్రాల నకళ్ళు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో సహా దరఖాస్తు చేయాలని సూచించారు.

సంఘ సేవకులు ఆళ్ల ప్రవీణ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -అనకాపల్లి : అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్ కుమార్‌కు డాక్టరేట్ దక్కింది. ఆయన చేసిన సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి విశాఖపట్నం ద్వారకా నగర్ జిల్లా పౌర గ్రంథాలయంలో సోమవారం హెచ్ఎస్‌సి యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్ బిషప్ డాక్టర్ జాన్ పాల్, ప్రొప్రైటర్ ఎంవి ప్రసాద్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ డాక్టరేట్‌తో తనపై మరింత బాధ్యత పెంచిందని, మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రవీణ్ పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తంతడి పంచాయతీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ఎంపిపి కోన సంధ్య బుజ్జి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న వెల్నెస్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదన చేస్తామని చెప్పారు. వైసిపి నాయకులు రాజన్న అప్పారావు, చోడిపల్లి దేముడు, చెల్లుబోయిన నాయుడు, సిహెచ్ కృష్ణారావు, దేవరపు సత్తిబాబు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి దీపారాధన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని సబ్బవరం పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెం కెవి.స్వామిజీ జ్ఞాన మందిరంలో మంగళవారం కార్తీక పౌర్ణమి దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న శ్రీనివాసానంద సరస్వతి సనాతన ధర్మాలను బోధించారు.

అలరించిన యోగా విన్యాసాలు

కార్తిక పౌర్ణమి దీపోత్సవం సందర్భంగా కెవి.స్వామిజీ జ్ఞాన మందిరంలో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల యోగా విన్యాసాలు విశేషంగా అలరించాయి. ఆనంద ఆశ్రమం యోగా గురువు కోమల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు యోగా విన్యాసాలను ప్రదర్శించారు. బిఎన్ స్వామి, ఎంపిటిసి బైలపూడి దేముడు బాబు, సింగంపల్లి అమ్మోరు, గండి దేముడు, గొంప దేముడు, సింగంపల్లి నాగరాజు, కోటాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైవాడను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు


రైవాడ రిజర్వాయర్‌లో చేపపిల్లలను వేస్తున్న డిప్యూటీ సిఎం బూడి, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని రైవాడ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టితో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన జలాశయాన్ని సందర్శించారు. బిల్లలమెట్ట వద్ద ఉన్న రెగ్యులేటింగ్ గేట్లు ఎక్కి జలాశయం ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సహకారంతో అనకాపల్లి జిల్లాలోని కొండకర్ల ఆవ, రైవాడ జలాశయం ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా మార్చి ఆయా ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు వచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. రైవాడ గ్రామానికి ఎత్తిపోతల పథకం కింద జలాశయం నీరు అందించేందుకు రూ.250 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. కలెక్టర్ రవి మాట్లాడుతూ జలాశయంలో మంగళవారం ఆరు లక్షల చేప పిల్లలను వేశామని, త్వరలో మరో నాలుగు లక్షల చేప పిల్లలు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. 8 నెలల పాటు చేప పిల్లల పెంపకం జరుగుతుందన్నారు. దీనివలన 400 కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి పి.లక్ష్మణరావు, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, వైస్ ఎంపిపి గంగభవాని అప్పారావు, సర్పంచ్ చల్లా లక్ష్మి నాయుడు, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపిడిఒ జీవీ రమణ, ఎంఈఒ సిహెచ్ రవీంద్రబాబు, జలశయం ఏఈ సత్యం నాయుడు, వైసిపి నాయకులు బూరె బాబురావు, డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, చల్లా తాతయ్యలు, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, వేచలపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామ పంచాయతీ కార్మికులకు కొన్ని నెలలుగా బకాయి పడ్డ జీతాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు డిమాండ్ చేశారు. బొజ్జన్న కొండ వద్ద మంగళవారం జిల్లా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశం పలివెల చిన్నారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్రావు మాట్లాడుతూ కార్మికుల జీతాలు చెల్లిస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించి నెలరోజులు అవుతున్నా నేటి వరకు అమలు కాలేదన్నారు. నెలకు రూ.3వేలు నుంచి రూ.6 వేలు జీతంతో అర్ధాకలితో అలమటిస్తున్న కార్మికులకు, ఆ జీతాలు కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. జీతాలు రాక అప్పులు చేసుకొని తినవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీస వేతనాలు, పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయలేదని, కార్మికులు అనారోగ్యం పాలైన, చనిపోయిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ జీతాలు ఈనెల 16 లోగా చెల్లించకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చిన్నారావు, ములకలపల్లి అప్పలరాజు, ఎల్లబెల్లి అప్పారావు, అనకాపల్లి ఈశ్వరమ్మ, ఒమ్మి నాగేష్, రావాడ కనకమహాలక్ష్మి, ఉప్పాక లోకేష్, పార్వతి, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి -యలమంచిలి : క్రీడలు మానవజీవితంలో భాగమని, వాటిని ప్రోత్సహించి, క్రీడాకారుల్ని తయారు చేయడం ప్రభుత్వ విధి అని ఎంపిపి బోదెపు గోవిందరావు అన్నారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జరిగిన సిఎం కప్ నియోజకవర్గ స్థాయి క్రీడా సెలక్షన్స్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణక్రీడాకారుల్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సెలక్షన్స్‌లో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ విభాగాల్లో జిల్లా టీముల్ని ఎంపికచేసినట్లు శాప్ ప్రతినిధి రమేష్, హాకీ కోచ్ రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొద్దపు ఎర్రయ్యదొర, కొరారు కొండబాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి -యలమంచిలి : జిల్లాస్థాయి యోగాపోటీల్లో యలమంచిలి విద్యార్థి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మంగళవారం పరవాడ మండలం వాడచీపురుపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో స్థానిక కొత్తపేట హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జి.లయవర్ధన్ ప్రథమస్థానం సాధించారు. లయవర్ధన్ గత నెలలో జరిగిన మండల, నియోజకవర్గ స్థాయిల్లోనూ ప్రథమస్థానం పొంది జిల్లాకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ యలమంచిలి నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఎఎన్ మూర్తి చెప్పారు. తమ పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానం పొందడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి అప్పారావు అభినందనలు తెలిపారు.

నాగభూషణానికి 'పప్పల' పరామర్శ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలుగుదేశం పార్టీ సీనియర్ దళిత నాయకులు, నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ దొక్కా నాగభూషణాన్ని మాజీ ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, శరగడం యోగి నాగేశ్వరరావు, మళ్ల వరాహనరసింగరావు, దాడి శివ, ఆడారి గోవిందు, పెతకంశెట్టి రాజు, పొలమరశెట్టి నాగు పాల్గొన్నారు.

గురుస్వామి నర్సింగరావుకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : గవరపాలెం రైతు సంఘ ఆశ్రమం 25వ వార్షికోత్సవం సందర్భంగా మళ్ల జగన్నాథం కళ్యాణ మండపంలో గురు స్వామి మళ్ల నర్సింగరావును అయ్యప్ప స్వాములు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురు స్వాములు కాండ్రేగుల దాసు, కొణతాల పూర్ణచంద్రరావు, మళ్ల సురేంద్ర, కొణతాల పాండు, కొలపర్తి కన్నబాబు, పీలా శ్యామ్, కొణతాల అప్పలనాయుడు, దాడి భోగలింగేశ్వరరావు, పీలా రాముడు పాల్గొన్నారు.


భూముల రీ సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దారు సత్యనారాయణ

పైడివాడ అగ్రహారంలో భూముల రీ సర్వే

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో మంగళవారం సమగ్ర భూ రీ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ పైడివాడ అగ్రహారం రెవెన్యూ పరిధిలోని భూ రీ సర్వేకు సంబంధించిన రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలతో సర్వేలో పాల్గొని తమ భూ సరిహద్దులను సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి వెంకట్, మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విభజన హామీలకు పాతరేసిన వైసిపి మంత్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి : విభజన హామీలకు వైసిపి మంత్రులు పాతరేసి ప్రధాని పర్యటనకు ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రానికి రావలసిన విభజన హామీలు, ప్రత్యేక హోదా అంశాన్ని పక్కనపెట్టి కనీసం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కూడా నోరు మెదపని కేంద్రాన్ని ప్రశ్నించలేని దద్దమ్మలు, ప్రధాని పర్యటన, స్వాగత సత్కారాల కోసం ఆపసోపాలు పడుతున్నారని విమర్శించారు. జగన్ రెడ్డికి ఉన్న కేసులకు భయపడి రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేశారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్రానికి రావలసిన విభజన హామీలపై, రాష్ట్ర ప్రయోజనాలను సాధించడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ధనాల విష్ణు చౌదరి, మళ్ల గణేష్, అక్కిరెడ్డి రమణబాబు, కుప్పిలి జగన్మోహన్ పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిరండి

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : ఈనెల 12న విశాఖలో జరగనున్న ప్రధాని నరేంద్ర మోడీ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుండి ప్రతి గ్రామం నుంచి బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని కట్టుపాలెంకు చెందిన పండూరి గణేశ్ (26)కు దళిత మహిళను మోసం చేసిన కేసులో కోర్టు మంగళవారం 14 రోజులు రిమాండ్ విధించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గఫూర్ విలేకర్లకు తెలిపారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ, దళిత బహుజన కాలనీకి చెందిన చుక్కా జయ (22)ను, యలమంచిలి మున్సిపాలిటీ కట్టుపాలెం వార్డుకు చెందిన పండూరి గణేశ్ (26) పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా దగ్గరై ఆ తర్వాత మాట మార్చారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పండూరి గణేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ గఫూర్ తెలిపారు.

ప్రజల చెంతకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మెరుగైన వైద్యం ప్రజలకు చేరువు కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గడప వద్దకే వైద్యులు వచ్చి పలు రకాల టెస్టులు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులను అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.


రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

మన్యవాసుల రహదారి కష్టాలకు చెక్!

- ఎంపి సుజనా చొరవతో నిధులు మంజూరు
- కొండమార్గంలో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజనులు
- పక్కారోడ్డుగా పటిష్టం చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి-మాడుగుల : నేల కనబడనంతగా తుప్పలు, చెట్లతో నిండిన దట్టమైన అటవీ ప్రాంతం, నిండా భారీ బండరాళ్లు, విష సర్పాలు,అడవి జంతువులు సంచరించే ప్రాంతం, వాటి మధ్యలో సన్నని కాలిబాట.. ఇదే కొద్దిరోజులక్రితం వరకు అనేక గ్రామాల గిరిజనానికి రాకపోకలకు మార్గం. నిత్యవసరమైనా, అత్యవసరమైనా, లేదంటే పండించిన పంటలు అమ్ముకోవాలన్నా, ఇంటికి సరుకులు తెచ్చుకోవాలన్నా ఏళ్లతరబడి మన్యవాసులు ఇదే మార్గంలో వెళ్లిరావాల్సిందే. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వీరి గోడు ఇన్నాళ్లు అరణ్యరోదనగానే మిగిలిపోగా, స్థానిక ప్రజాప్రతినిధులెవరికీ పట్టకపోయినా, సోషల్‌మీడియాలో వైరల్ అయిన కథనాలతో రాజ్యసభ సభ్యుడు సృజనాచౌదరి స్పందించి, నిధులు మంజూరు చేయడంతో ఇపుడు ఒక మట్టిరోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో బ్రహ్మాండాన్నే సాధించినంతగా సంబరపడిపోతున్న గిరిజనులు, మట్టిరోడ్డును తారుతో పటిష్టం చేసి తమ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మాడుగుల నుండి దేవపురం అటవీ ప్రాంతంలో 15 గిరిజన గ్రామాలకు ఎట్టకేలకు ఒక మట్టిరోడ్డు నిర్మితమైంది. బండరాళ్లు, తుప్పలతో నిండిన ఎగుడుదిగుడు కొండమార్గంలో ఇన్నాళ్లు రాకపోకలు సాగించిన మారుమూల గిరిజనులకు ఇపుడు రోడ్డు నిర్మాణంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాము పండించిన పంటలను , సేకరించిన అటవీ ఉత్పత్తులు తలపైనో లేకుంటే భుజాన్నో మోస్తూ కాలినడకన మాడుగులకు విక్రయించేందుకు వచ్చేవారు.

ఒక పర్యాయం ప్రసవ వేదనతో బాధపడుతున్న గిరిజన గర్భిణిని డోలిలో ఇదే మార్గంలో మోసుకుంటూ ఆస్పత్రికి తీసుకెళ్లిన దృశ్యాలను ఎవరో సెలఫోన్‌లో రికార్డుచేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అదికాస్తా వైరల్ కావడంతో ఇక్కడి నేతలకు అదేమీ పట్టకపోయినా, రాజ్యసభ సభ్యుడు సుజనాచౌదరి స్పందించి నిధులు మంజూరు చేయడంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. భారీ బండరాళ్లను తొలగించి, కొండఅంచుల్లో రోడ్డుకు రూపాన్ని ఏర్పాటు చేసి, దాన్ని కంకరతో పటిష్టం చేయడంతో ప్రస్తుతం సైకిళ్లు, బైక్‌లు, ఆటోలు రాకపోకలకు వీలుగాతయారైంది. ఉబ్బలింగ స్వామి దేవాలయం వద్ద నుండి దేవపురం వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మార్గాన్ని పూర్తిగా చదును చేసి రోడ్డుగా మార్చారు.



దేవవరం గిరిజన గ్రామాలకు వేసిన మట్టిరోడ్డు

దేవపురం పరిసర గ్రామాల ప్రజలు తమ ఉత్పత్తులను మాడుగుల తీసుకెళ్లడానికి ఇదే దగ్గర దారి .పాడేరు ఘాట్ రోడ్డు మార్గంలో 12వ మైలురాయి, వంటలమామిడి మీదుగా రహదారి మార్గంలో మాడుగుల చేరుకునేందుకు అవకాశం ఉన్నప్పటికి, చుట్టూ తిరిగి రావడానికి బహుదూరం కావడంతో కష్టమైనా కాలినడకనే మాడుగుల వచ్చేందుకు గిరిజనులు ఆసక్తి చూపేవారు. అత్యంత క్లిష్టం, కష్టమైనా ఇదే మార్గంలో వచ్చే గిరిజనులకు ప్రస్తుతం నిర్మితమైన రోడ్డుతో కొంతమేర కష్టాలు తీరనున్నాయి. తాత్కాలికంగా ఏర్పాటైన మట్టిరోడ్డును పటిష్టం చేయాలని మన్యవాసులు కోరుతున్నారు. అదే పూర్తయితే గిరిజనం రాకపోకల కష్టాలు తీరడంతోపాటు మాడుగుల సంత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

వెంకన్న ఆలయం మూసివేత

ప్రజాశక్తి -నక్కపల్లి : చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మంగళవారం ఉదయం నుంచి మూసివేశారు. కొండపైన, కింద వున్న ఆలయాల్లో ఉదయం నిత్యపూజలు, స్వామివారికి అభిషేకం, అలంకరణ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు ఆలయ మహాద్వారం, సహా ఆస్థానమండపం ద్వారాలను మూసివేశారు. గ్రహణం అనంతరం ఆలయంలో శుద్ధి పుణ్యాహవాచనం, సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడతామని, బుధవారం ఉదయం నుంచి యథావిధిగా దర్శనాలుంటాయని ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు తెలిపారు. ఆలయ అర్చకులు పీసపాటి శెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది చలపతి, కొర్లాపు మహేశ్, బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉదయం ఎనిమిదిన్నరకే విధులకు హాజరు

ప్రజాశక్తి -కోటవురట్ల, : గ్రామ సచివాలయాలకు కార్యదర్శులు ప్రతినిత్యం ఉదయం 8.30గంటలకు విధులకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ రవిసుభాష్ పటాన్‌శెట్టి ఆదేశించారు. మంగళవారం మండల స్థాయి అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బయోమెట్రిక్ హాజరు ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు, జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు.

'నాడు - నేడు' నిధులతో కాలేజీ ప్రహరీ

ప్రజాశక్తి-గొలుగొండ :మండలంలోని ఏజెన్సీ లక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు నేడు నిధులు రూ.6.53లక్షలతో కళాశాల చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర సమస్యలకు మరమ్మతులు వంటి పనులు చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



నిర్మాణంలో ఉన్న కాలేజీ ప్రహరీ

ప్రజా చైతన్యంతో ప్రభుత్వ అరాచకాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే ప్రభుత్వ అరాచకాలను నియంత్రించవచ్చునని మాజీ మంత్రి, టిడిఎ పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మంగళవారం నర్సీపట్నం వచ్చి అయ్యన్నపాత్రుడిని పరామర్శించి, సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నించడం వల్లే అయ్యన్నపాత్రునిపై వైసిపి ప్రభుత్వం కక్షగట్టి, అక్రమ కేసులు బనాయించిందన్నారు. అయ్యన్నకు పార్టీతోపాటు తామంతా వెన్నంటే ఉంటామని భరోసానిచ్చారు. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

అయ్యన్నకు టిడిపి నేతలు సంఘీభావం

అచ్యుతాపురం : మాజీమంత్రి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడును నర్సీపట్నంలో మంగళవారం అచ్యుతాపురం మండలానికి చెందిన టిడిపి నాయకులు కలిసి సత్కరించి సంఘీభావం తెలిపారు. అక్రమ అరెస్టులను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జూనియర్ ప్రగడ నాగేశ్వరరావు, పతివాడ చిన్నయ్య నాయుడు, లాలం నాగేశ్వరరావు, పీలా కాసుబాబు, లాలం రమణ, రాజాన రామునాయుడు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- వాల్టా చట్టానికి ఇసుకాసురుల తూట్లు
- భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆందోళన
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



బళ్లులో తరలిపోతున్న ఇసుక

ప్రజాశక్తి - కోటవురట్ల : రాత్రీ, పగలనే తేడా లేకుండా మండల వ్యాప్తంగా నదీ పరివాహక ప్రాంతాలైన పందూరు, రామచంద్రపురం, గొట్టువాడ, చౌడువాడ, కైలాసపట్నం, జల్లూరు, అన్నవరం, తదితర గ్రామాల నుంచి నిరాటంకంగా నిరంతరం ఇసుక అక్రమంగా తరలిపోతోంది. తమకేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడంపై పరిసర ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. నదిగర్భంతోపాటు పరివాహక ప్రాంత పొలాలను అనుకొని ఉన్న ఇసుకను అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలించుకుపోవడంతో తీరప్రాంత భూములు కోతకు గురవుతున్నాయని, అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడం లేదని రైతులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వలు సమృద్ధిగా లేవని మైన్స్ అధికారులు అనుమతి ఇవ్వకపోయినా ఇసుకను తరలించుకుపోవడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. దీంతో రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, నదితోపాటు తీరప్రాంత భూముల పరిరక్షణకు, నదీ ఉపరితల, భూగర్భ జలాల సరంక్షణ చర్యలుచేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గీత కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని టిడిపి బిసి యాత సాధికారత కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఓనం శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం మండలంలోని వేములపూడి గ్రామంలో నిర్వహించిన యాత సాధికారిత సమావేశంలో మాట్లాడుతూ, లోపభూయిష్టమైన ఎక్సైజ్ పాలసీతో కల్లు గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపిస్తోందన్నారు. వృత్తి, ఉపాధి అవకాశాలు లేక, పరిశ్రమలు రాక, అందరికీ సంక్షేమం అందక గీతకార్మికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ పాలసీకి సవరణలు చేపట్టి, కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోయినా, గాయాలపాలైనా ప్రభుత్వపరంగా ఎక్సైజ్‌శాఖ ద్వారానే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన గీతకార్మికులకు రూ.పది లక్షల పరిహారంతోపాటు అంగవైకల్యానికి గురైతే, వైకల్యం స్థాయిని బట్టి రూ.రెండు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు పరిహారం చెల్లించి బాధిత గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు నెల్లి వేమాలయ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



వేడుకల్లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్: స్థానిక మదర్ ఒకేషనల్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు ఘనంగా ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవికుమార్, వార్డెన్లు బాబురావు, ఈశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి ఇంటర్ విద్య చాలా కీలకమైనదని, ఇక్కడ బాగా చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విలువలతో కూడిన విద్యను అందించేందుకు కళాశాల కృషి చేస్తుందని, కష్టపడి చదివి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్రీ ప్రకాష్‌లో 'రిమ్ జిమ్ -2022'

ప్రజాశక్తి - పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో రిమ్ జిమ్ -2022 మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 11 వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాయకరావుపేట, తుని అన్నవరం శాఖల శ్రీ ప్రకాష్ విద్యార్థులు పాల్గొంటారన్నారు మొత్తం సాహిత్యం, సంగీతం, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్ అంశాలలో 4500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, ముగింపు కార్యక్రమం నవంబర్ 14న జరుగుతుందని విద్యా సంస్థల ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి తెలిపారు. విద్యార్థులలోని ప్రతిభ, ప్రజ్ఞా పాటవాలను వెలికితీసేందుకు ఈ రిమ్‌జిమ్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో మండల సభకు హాజరు కావాలని ఆదేశించారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే బాబూరావుకు నిరసన సెగ

గడప గడపకూ ప్రభుత్వంలో 'గోబ్యాక్ ఎమ్మెల్యే' అంటూ మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి : మత్స్యకార గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బాబూరావుకు నిరసన సెగ తగులుతోంది. మంగళవారం పెదతీనార్ల మత్స్యకార గ్రామంలో ఎమ్మెల్యే బాబూరావు పర్యటించారు. ఆయన గ్రామంలోకి అడుగుపెట్టగానే ఎమ్మెల్యేను నిలదీసేందుకు మత్స్యకార నాయకులు ఎంపిటిసి మేరిగి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గోసల తాతారావు , జనసేన పార్టీ యువత సిద్ధపడ్డారు. పెదతీనార్లలో ఎమ్మెల్యే పర్యటనకు నిరసన సెగ తగులుతుందని గుర్తించిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఐ నారాయణరావు, ఎస్ఐలు శిరీష, ప్రసాదరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

హెటెరో కంపెనీ వల్ల మత్స్యసంపద నాశనమవుతోందని, మత్స్యకారుల జీవనోపాధి, ఉనికి దెబ్బతింటోందని 343 రోజులుగా ఆందోళన చేస్తున్నా ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి పట్టడం లేదని నినదించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని , రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలుపుతూ ఎమ్మెల్యే బాబూరావు వద్దకు వెళ్లి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డగించారు. దీంతో పోలీసులు, మత్స్యకారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే గోబ్యాక్, డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.



గడప గడపలో ప్లకార్డులతో నిరసనచేస్తున్న మత్స్యకారులు

జాతీయ స్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో
ఆంధ్రా బాలికల జట్టు ప్రతిభ



ద్వితీయ స్థానంలో నిలిచిన ఆంధ్రా జట్టు క్రీడాకారులు

ప్రజాశక్తి -గొలుగొండ : పంజాబ్, లూథియానాలో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఆ జట్టు కెప్టెన్ తనుషా గొలుగొండ మండలవాసి కావడం విశేషం. కొమిర గ్రామ మాజీ సర్పంచ్ కర్రీ మంగనాయుడు కుమార్తె, అనకాపల్లి జిల్లా శ్రీ ప్రకాష్ స్కూల్ నుంచి ఈ పోటీల్లో పాల్గొని జట్టును విజేతగా నిలపడంలో కృషి చేసింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు, కెప్టెన్ తనూజకు, అలాగే కోచ్, మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావుకు ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లికార్జునరెడ్డి, కర్నూల్ జిల్లా సెక్రటరీ సి.సుబ్బయ్య అభినందనలు తెలిపారు.

అల్లూరి పేరిట
125 రూపే నాణాన్ని విడుదల చేయాలి

ప్రజాశక్తి -గొలుగొండ : తెలుగు జాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్వాతంత్ర సమరయోధుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 125వ జయంతోత్సవం సందర్భంగా 125 రూపే నాణాన్ని విడుదల చేయాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు కోరారు. ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వచ్చే ప్రధాని మోడీ దీనిపై బహిరంగసభలో ప్రకటించాలని లేఖ ద్వారా కోరారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి రోజున కేంద్ర ప్రభుత్వం 125 రూపే నాణాన్ని విడుదల చేసిందని, అలాగే అల్లూరి పట్ల వివక్ష చూపక, అల్లూరి పేరున కూడా 125 రూపే నాణాన్ని విడుదల చేయాలని కోరారు. విప్లవ వీరుడు భగత్‌సింగ్ పేరును ఒక విమానాశ్రయానికి పెట్టారని, అలాగే విశాఖ జిల్లాలో ఏదో ఒక అభివృద్ధి పనికి అల్లూరి పేరును పెట్టాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో అల్లూరి విగ్రహం ఏర్పాటుకు కూడా అనుమతి ఇవ్వాలని, దాని వ్యయం జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

సర్వేకు సహకరించండి

ప్రజాశక్తి -రోలుగుంట : గ్రామ సరిహద్దులు సర్వే చేయుటకు కేంద్ర బృందం వచ్చిందని, సర్వేకు అందరూ సహకరించాలని తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని జెపి.అగ్రహారంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ, జెపి అగ్రహారం గ్రామంలో 480 ఎకరాల భూమి ఇనాం భూమిగా పూర్వం నుండి దఖలు పడిందని, కొంత మంది పెద్దలు వస్తే దాని గురించి చర్చిస్తానన్నారు. తాత ముత్తాతల దగ్గర నుండి ఇనాం భూమి అని ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందలేదని జిల్లా కలెక్టరేట్ ,ఆర్డీవో స్పందనలో విన్నవించిన నేపథ్యంలో అటువంటి భూసమస్యలకు సర్వేతో పరిష్కారం లభిస్తుందన్నారు.

సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరం

సారాను అమ్మినా, తయారు చేసినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రోలుగుంట తహశీల్దార్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సారా కేసుల్లో పట్టుబడ్డ 52 మందిని మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సమావేశమై మాట్లాడారు.సారా నిందితుల ఏడాదిలోపు మళ్లీ సారా అమ్మినా, తయారు చేసినా పట్టుబడితే రూ.2లక్షల జరిమానా విధిస్తామన్నారు.కార్యక్రమంలో ఎస్ఇబి స్పెషల్ ఎన్‌ఫోర్సమెంట్ సిఐ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సారా నిందితులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రధాని పర్యటనకు విజయసాయి హడావుడి ఎందుకో..

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : ప్రధాని నరేంద్రమోడీ విశాఖపట్నం పర్యటనకు అంతా తానే అన్నట్లు విజయసాయిరెడ్డి పెద్ద హంగామా చేస్తున్నారని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మంగళవారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో, ఈ నెల 11న ప్రధాని విశాఖ వస్తున్నారని, 12న కొన్ని కార్యక్రమాలకు శంకుస్థాపనలు, బహిరంగసభ ఉంటుందన్నారు. ఈ వ్యవహారంలో విజయసాయిరెడ్డికి, విశాఖపట్నానికి సంబంధం ఏమిటన్నారు. విశాఖపట్నంలో రూ.45వేల కోట్ల విలువ గల ప్రభుత్వ, ప్రైవేటు భూములను సర్వం దోచుకున్నారన్నారు అటువంటి విజయసాయిరెడ్డి దేశ ప్రధాని ఏర్పాట్లు చేయడం ఏంటన్నారు. విశాఖ ఎంపి ఎంవివి. సత్యనారాయణ ఎక్కడా కనిపించడం లేదన్నారు. దీనిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు కూడా ఆలోచన చేయాలన్నారు. రుషికొండను ఏ విధంగా తవ్వేశారో, విశాఖను ఏ విధంగా దోచు కుంటున్నారో ప్రధాని దృష్టి తీసుకువెళ్లాలన్నారు. విశాఖలో రుషికొండను కాపాడాలని, దీనికోసం ప్రధాని మోడీ రుషికొండను పరిశీలించాలని ప్రధానికి రాసిన లేఖలో కోరినట్లు తెలిపారు. అమరావతి రాజధానికి ప్రధాని శంకుస్థాపన చేశారని, కానీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజధానిని పక్కన పెట్టి రైతులకు అన్యాయం చేస్తున్నారని, దీనిపై ప్రధాని ఆలోచన చేసి అమరావతి రాజధాని పూర్తి చేసే బాధ్య త తీసుకోవాలని కోరారు. విశాఖపట్నాన్ని అభివృద్ధి చేయాలని, ఉత్తరాంధ్రను దోపిడి చేస్తున్న విషయాన్ని గుర్తెరిగి న్యాయం చేయాలని కోరారు.

మత్స్యకారుల సమస్యపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-నక్కపల్లి : నిర్వాసిత మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం రాంబిల్లి మండలం ఎన్ఎఓబి మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసిత మత్స్యకారులను కలిసి, వారికి సంఘీభావం ప్రకటించారు. మత్స్యకారుల సమస్యల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం దారుణమని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. మత్స్యకారుల సమస్యను జాతీయ స్థాయిలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి వివరిస్తామన్నారు. జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొవిరి వెంకటేష్, జిల్లా యువత అధ్యక్షుడు మైలపల్లి జగ్గారావు, ఎస్.రాయవరం మండల అధ్యక్షులు ఎం.సంజీవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలరాజు

సుడిదోమ ఉధృతితో వరిపైర్లకు నష్టం

ప్రజాశక్తి -నక్కపల్లి : వరిపైర్లను ఆశించిన సుడిదోమ నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు టిఎస్ రాజ్‌కమల్, మండల వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని కాగిత, పెద దొడ్డిగల్లు, చిన దొడ్డిగల్లు తదితర గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన జరిపారు. వరి పొలాలను పరిశీలించి, పైర్లలో సుడి దోమ ఉధృతి ఎక్కువగా ఉండడాన్ని గమనించారు. సుడిదోమ నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. సుడి దోమ నివారణ కు పైమెట్రోజిన్ 50 డబ్ల్యూఎస్ 0.6గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా డైనోటేఫ్యూరాన్ 20 ఎస్‌జి 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి, ఎకరాలకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని దుబ్బు మొదళ్ల వద్ద బాగా తడిసేలా పిచికారి చేయాలని సూచించారు. అవకాశం వున్నంత వరకు పొలంలో నీరు తీసేసి సాయంత్రం సమయంలో పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది రాజేష్, మోహన్, నాయుడు పాల్గొన్నారు.



సస్యరక్షణ సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

నేటి నుంచి జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జగనన్న క్రీడా సంబరాలలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 10వ తేదీ, గురువారం ఉదయం 10 గంటల నుంచి నర్సీపట్నం ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కె. వరహాలబాబు, శాప్ కోచ్, పీఈటీ కె. అబ్బు తెలిపారు. 17ఏళ్ల నిండిన క్రీడాకారులంతా పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఆధార్‌కార్డుతో ఎంపికలకు రావాలని కోరారు. క్రీడాకారులు తప్పనిసరిగా జగనన్న క్రీడా క్లబ్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మహిళలు, పురుషులకు కబడ్డీ వాలీబాల్, కేవలం పురుషులకు మాత్రమే క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94915 51230, 93327 77778 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలు



మాట్లాడుతున్న ఎస్ఇబి సిఐ తేజవెంకటకుమార్

ప్రజాశక్తి -పాయకరావుపేట : సారా నిందితులకు స్వయంఉపాధి కోసం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 17మందికి రాయితీపై రుణాలు మంజూరు చేశామని, ఎస్ఇబి పాయకరావుపేట సిఐ తేజ వెంకటకుమార్ అన్నారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ, సారా వ్యాపారం మానేసి, ప్రత్యామ్నాయంగా వేరే ఏదైనా వ్యాపారం చేసి జీవనోపాధి పొందేందుకు వీలుగా ఈ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సారా నిందితులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఎస్‌సి కార్పొరేషన్ ఇఇఒ యూన్నీ మాట్లాడుతూ సారా కేసుల్లోని నిందితుల కుటుంబపోషణకు ప్రత్యామ్నాయ వ్యాపారం చేసుకొనుటకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ రుణాలను మంజూరు చేసిందన్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల్లోని 17మందికి ఈ రుణాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ అధికారులు శంకర్, భాస్కర్ పాల్గొన్నారు

స్థలం మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి -మాడుగుల : మండల కేంద్రంలో తూర్పుకాపు సంఘం కార్యాలయ భవన నిర్మాణానికి పది సెంట్లు స్థలం మంజూరు చేయాలని తూర్పు కాపు డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ గొల్లవిల్లి ప్రభావతి కోరారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును కలిసి విన్నవించామని, ఆయన సానుకూలంగా స్పందించా రని తెలిపారు. మాడుగుల ప్రాంతంలో తూర్పుకాపులు ఎక్కువగాఉ న్న నేపథ్యంలో సంఘంగా ఏర్పడిన వారు సమావేశాలు ఇతర కార్యకలాపాలకు మాడుగులలో సంక్షేమ సంఘం నిర్మాణం చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనువైన స్థలం లేకపోవడంతో సంఘ భవనం నిర్మాణానికి వీలు కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వపరంగా తూర్పుకాపుల సంఘానికి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు.

మన్యాన్ని తలపిస్తున్న మంచు అందాలు



కోటవురట్లలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో మంగళవారం ఉదయం కురిసిన మంచు మన్యాన్ని తలపిస్తోంది. దట్టంగా కూర్చున్న మంచు కారణంగా ఒకసారిగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. మంచు కారణంగా వాహనదారులు అదేవిధంగా పొలం పనులకు హాజరయ్యే రైతులు, కూలీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఆచితూచి ముందుకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.